సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 18 । డిసెంబర్ । 2023





**జాతీయ పోటీలకు ఉక్కు విద్యార్థులు**

విశాఖ విమల విద్యాలయం విద్యార్థినులు కిక్ బాక్సింగ్ జాతీయ పోటీలకు అర్హత సాధించారు. 8లో



**మోగిన నెలగంట**

సింహగిరిపై నెలగంట మోగింది. నెల రోజులపాటు జరిగే ధనుర్మాస పూజలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. 8లో



**ఆరోగ్యం కోసం ఆర్గానిక్..**

ఆర్గానిక్ మేళాకు చివరి రోజు ప్రజలు పోటెత్తారు. మేళాను తిలకించడానికి చాలామంది ఆసక్తి చూపారు. 8లో

## న్యూస్‌రీల్

### జూకి రూ 6.84 లక్షలు ఆదాయం



జూ లోపలకు ప్రవేశిస్తున్న సందర్శకులు

**ఆరిలోవ:** జూ పార్కులో ఆదివారం సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో జూ పార్కును వేలమంది సందర్శించారు. దీంతో జూకి రూ.లక్షల్లో ఆదాయం లభించింది. జూను సందర్శించిన పిల్లలు, పెద్దలు, వన్యప్రాణులను తిలకించి సరదాగా గడిపారు. అక్కడ జంతువులు, పక్షులు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ సందర్శకులను అలరించాయి. ఆదివారం రెండు గేట్ల ద్వారా 8,550 మంది సందర్శించినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. వారి ద్వారా రూ 6.84 లక్షలు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

### సినీనటి జయసుధకు సత్కారం



జయసుధను సత్కరిస్తున్న రాగమయి సాంస్కృతిక సంగీత సంస్థ, ప్రముఖులు

**దాబాగార్డెన్స్:** ప్రముఖ సినీనటి జయసుధను రాగమయి సాంస్కృతిక సంగీత సంస్థ ఘనంగా సత్కరించింది. దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఆదివారం 'ఈ రోజు మంచి రోజు..మరుపురాని మధురమైనది' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరిలో సంస్థ అధ్యక్షురాలు కందర్ప రాధ, పలువురు ప్రముఖులు సత్కరించారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు జేవీఎంఆర్ నెహ్రూ, కార్యదర్శి ఎమ్ త్రినాథ్, కన్వీనర్ విజయరమణి పాల్గొన్నారు.

### సిద్ధమవుతున్న ఎన్‌ఎస్‌టీఎల్ ప్రదర్శనశాల



బుచ్చిరాజులపాలెంలో నిర్మాణంలో ప్రదర్శనశాల

**విశాఖ విద్య:** విశాఖ నగరంలోని ఎన్‌ఎస్‌టీఎల్ దరి నావికా విజ్ఞాన, సాంకేతిక ప్రయోగశాల(ఎన్‌ఎస్‌టీఎల్) వద్ద బుచ్చిరాజుపాలెం సెంటర్‌లో అందరినీ ఆకట్టుకునేలా ప్రదర్శన శాల సిద్ధమౌతుంది. ఎన్‌ఎస్‌టీఎల్ గేటు ముందు మూడు రోడ్లు సెంటర్‌లో దీనిని ఏర్పాటు చేస్తున్నందున 'ట్రైడెంట్'గా దీన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేలా పనులు వేగవంతం చేశారు. డీఆర్‌డీవో ప్రయోగశాలలో ఉండే వివిధ మిషనరీల ప్రతిబింబాలను ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. 35 అడుగుల మేర షిప్‌ను కూడా ఇక్కడ పెట్టనున్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో మాత్రమే ఇలాంటి ప్రదర్శనశాలలు ఉండగా, ప్రస్తుతం విశాఖ ఎన్‌ఎస్‌టీఎల్ ముందు కూడా అదే రీతిన అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థులు, సైన్స్ సంబంధిత ప్రయోగాల వైపు వెళ్లే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పనులు పర్యవేక్షణ చేస్తున్న ఓ అధికారి తెలిపారు.

### శోభన్‌బాబు కాంస్య విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

**దాబాగార్డెన్స్:** దివంగత సినీ నటుడు శోభన్‌బాబు కాంస్య విగ్రహావిష్కరణ ఆదివారం దాబాగార్డెన్స్ కూడలిలో ఘనంగా జరిగింది. విగ్రహ నిర్మాణ కమిటీ, విశాఖపట్నం శోభన్‌బాబు అభిమానులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విగ్రహ దాత రామాంజనేయులతో పాటు పలువురు వక్తలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న నటుడుగా శోభన్‌బాబు ఎంతో గుర్తింపు పొందారన్నారు. ఈ సందర్భంగా దాతలను విగ్రహ నిర్మాణ కమిటీ సత్కరించింది. విగ్రహ స్థల దాత ఎ.సతీష్‌కుమార్, రాశీ మూవీస్ అధినేత ఎం.నరసింహారావు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, కోడూరు కనకరాజు, గువ్వల రమణ, త్రినాథ్, శోభన్‌బాబు, ఈశ్వరరావు, ముమ్మల పోలారావు, దసపల్లా హోటల్ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

# ఉల్లాసంగా వైజాగ్ మారథాన్



ఆర్కే బీచ్ జనసంద్రం : రన్‌లో పాల్గొన్న వేలాది మంది యువత, నగర ప్రజలు



మారథాన్‌లో చిన్నారుల సందడి



ప్లకార్డులతో విద్యుత్ శాఖ అధికారుల ప్రదర్శన

- వేల సంఖ్యలో పాల్గొన్న యువత
- విజేతలకు నగదు బహుమతులు



**బీచ్‌రోడ్డు:** వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ ఉల్లాసంగా సాగింది. 21కే, 10కే, 5కే , 3కే నాలుగు విభాగాల్లో నిర్వహించిన ఈ మారథాన్‌లో సుమారు 7 వేల మంది రన్నర్స్ పాల్గొన్నారు. కేవలం మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా రన్నర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎంతో ఉల్లాసంగా మారథాన్ చేశారు. దీంతో సాగరతీరంలో సందడి వాతావరణం నెలకుంది. ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు సాగిన ఈ మారథాన్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణారాయ్ మాట్లాడుతూ వయోభేదం లేకుండా వేల సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండేందుకు, విశాఖ నగరం ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడడంపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సంధ్య మెరైన్స్ డైరెక్టర్ ఆనంద్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, యూనియన్ బ్యాంక్ డీజీఎం నటరాజ్ తదితరులు పాల్గొన్నారు..

**విజేతలు వీరే..**

21కే పురుషుల విభాగంలో ఆర్.ఆర్.నాయక్, మహిళ విభాగంలో సౌమ్య సరస్వతి గెలిపొందారు. వీరికి నిర్వాహకులు రూ.40 వేలు, మెడల్, ట్రోఫీని అందజేశారు. రెండు మూడు స్థానాల్లో గెలుపొందిన వారికి రూ.30 వేలు, రూ.20 వేలు అందజేశారు.అలాగే 10 కేలో పురుషుల విభాగంలో హరీష్, మహిళల విభాగంలో గ్రేస్ విజేతలుగా నిలిచారు. వీరికి రూ.15 వేలు, మెడల్, ట్రోఫీని అందజేశారు. రెండు, మూడు స్థానాల్లో వచ్చిన వారికి రూ.10వేలు రూ.7,500 అందజేశారు. వీరితో పాటు వివిధ విభాగాల్లో విజేతలను ప్రకటించి మొత్తం రూ. 5 లక్షల విలువ గల బహుమతులను అందజేశారు.

### విద్యుత్ ఆదా చేయండి

మారథాన్‌లో విద్యుత్ ఆదాపై ఆ శాఖాధికారులు అవగాహన కల్పించారు. మారథాన్‌లో ప్లకార్డులను ప్రదర్శించారు.

## తల్లిదండ్రుల ఆశయాలు, కలలు సాకారం చేయాలి

- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
- బీసీ బాలికల కళాశాల వసతి గృహం పునః ప్రారంభం



బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని పునః ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

**మహారాణిపేట:** ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలు, కలలను సాకారం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి ఉన్నత విద్యను అభ్యసించడానికి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలన్న సంకల్పంతో జిల్లాలోని అన్ని వసతి గృహాలను అధునాతన రీతిలో తీర్చిదిద్దామన్నారు. స్థానిక ఇసుకతోటలో ఆధునికీకరించిన ప్రభుత్వ వెనకబడిన తరగతుల బాలికల కళాశాల వసతి గృహాన్ని ఆయన ఆదివారం పునః ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖపట్నం పోర్ట్ అథారిటీ అందించిన రూ.29 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఈ వసతి గృహాన్ని పునర్నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికే సీఎస్ఆర్ నిధులతో భీమిలి ప్రాంతంలోని వసతి గృహాలను కూడా ఆధునికీకరించామన్నారు. జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను కూడా దశల వారీగా అభివృద్ధి చేయనున్నట్టు కలెక్టర్ వివరించారు. జిల్లాలో చాలా మంది పారిశ్రామిక వేత్తలు ఉన్నారని, వసతి గృహాల ఆధునికీకరణకు సహకరించాలని కోరారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి కె.శ్రీదేవి, సమగ్ర శిక్ష ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ డి.వి.నర్సింహారావు, సహాయ బీసీ సంక్షేమ అధికారులు ఎస్.వసంతకుమారి, బి.వి.రమణ, ఐ.జ్యోతిశ్రీ, వసతి గృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

## జిందాల్ స్టీల్‌తో రహస్య మంతనాలపై ఆగ్రహం

**నేడు ఉక్కు అడ్మిన్ వద్ద సీఐటీయూ ధర్నా**



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ బీఎఫ్-3 నడిపేందుకు జిందాల్ స్టీల్‌తో జరుగుతున్న రహస్య మంతనాలు బహిర్గతం చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిందాల్ స్టీల్‌తో ఎంఓయూ చేసుకోవాలని నిర్ణయించినట్టు తమకు సమాచారం ఉందన్నారు. సీఎండీ ఢిల్లీలో వర్చువల్‌గా డైరెక్టర్లతో మాట్లాడడం వెనుక అర్థమేంటని ప్రశ్నించారు. డిసెంబర్ 2న అఖిలపక్ష కార్మిక సంఘాలతో జరిగిన సమావేశంలో జిందాల్ రావట్లేదు, సెల్ యాజమాన్యంతో మాట్లాడుతున్నామని సీఎండీ స్పష్టం చేశారన్నారు. ఇంతలో ఏం జరిగిందో? ఢిల్లీ పెద్దల సమక్షంలో జరుగుతున్న రహస్య చర్చల సారాంశమేంటని వారు ప్రశ్నించారు. ఈ కుట్రను ఎదిరించేందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని వారు పిలుపు నిచ్చారు. ఉక్కు యాజమాన్యం వైఖరికి నిరసనగా సోమవారం ఉదయం ఉక్కు అడ్మిన్ 8 నుంచి 9 వరకు నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

## దీపాంక్ష కూచిపూడి నృత్యం అదరహో



**బీచ్‌రోడ్డు :** పాట్నూరు విజయ భరణి శంకర్ శిష్యురాలు గిల్లికాంశెట్టి దీపాంక్ష తన మొదటి కూచిపూడి ప్రదర్శన అదరహో అనిపించింది. శ్రీ అంబికేశ్వర కూచిపూడి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీలో ఆధ్వర్యంలో ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో కూచిపూడి రంగప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఆమె గం గణపతే నృత్యంతో పుష్పాంజలితో ప్రారంభించారు. అనంతరం నటరాజ స్తుతి, భామాకలాపం, గోవర్ధన గిరిధర్, రారా వేణు, తిల్లానా ప్రదర్శనలతో అలరించారు. చివరిగా రామచంద్రయ్య మంగళం ప్రదర్శనతో అదరహో అనిపించారు. ఈ నృత్యాలకు విజయ భరణి శంకర్, ఉదయ్ శంకర్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరించారు.

## ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపుపై హర్షం

**మహారాణిపేట:** వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంపై ప్రజారోగ్య వేదిక హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాసింది. గతంలో ఉన్న రూ.5 లక్షల పరిమితిని ఒక్కసారిగా రూ.25 లక్షలకు పెంచడం మంచి పరిణామని వేదిక ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు లేఖలో పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కేటాయింపుల వల్ల వైద్యారోగ్య శాఖ బడ్జెట్‌కు నష్టం జరగకుండా ప్రత్యేకమైన ఆరోగ్యశ్రీ బడ్జెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గత సర్కారు కంటే ప్రస్తుత ప్రభుత్వం ఆరోగ్య సేవలను మెరుగుపరిచిన విషయం వాస్తమన్నారు. ఉద్దానంలో కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని, మూత్ర పిండ వైద్య విభాగాన్ని ఏర్పాటు చేయడం అక్కడి ప్రజలకు ఎంతో ఉపయోగకరమని వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెఫ్రాలజీ, న్యూరాలజీ విభాగాలను ఏర్పాటు చేయడం బాగుందన్నారు.

# పక్కాగా ఓటరు జాబితా తయారీ

- అప్రమత్తమైన యంత్రాంగం
- బీఎల్‌వో స్థాయిలో ఇంటింటా సందర్శన
- క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన
- జిల్లాలోని ఆ నాలుగు నియోజకవర్గాలపై ఫోకస్
- నియోజకవర్గ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ
- వాస్తవికతను ఎన్నికల కమిషన్‌కు నివేదించిన కలెక్టర్



**విశాఖ విద్య:** ఓటరు జాబితా తయారీపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పక్కాగా జాబితాల రూపకల్పన చేసేలా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున కసరత్తు చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ప్రతీ రోజూ సమీక్ష చేస్తూ అధికారులకు దిశ, నిర్దేశం చేస్తున్నారు. అక్టోబర్ 23 ఎన్నికల కమిషన్ ప్రకటించిన జాబితాకు తుది రూపు ఇచ్చేలా కసరత్తు చేస్తున్నారు. అర్హులైన వారి నుంచి ఓటు హక్కు పొందేందుకు, అదే విధంగా ఒక చోట నుంచి మరో నియోజకవర్గానికి పేరు మార్పు కోసమని ఈ నెల 9 వరకు స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ఇప్పటికే పూర్తి చేశారు. ఈ ప్రక్రియ మొత్తం ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం అంతా అదే పనిలో నిమగ్నమైంది.

**క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన**

జిల్లాలోని భీమునిపట్నం, విశాఖ నార్త్, విశాఖ వెస్ట్, గాజువాక నియోజకవర్గాలకు సంబంధించి ఓటరు జాబితాల్లో 38,872 మంది ఓటర్లపై పలు అభ్యంతరాలతో ఫిర్యాదులు చేశారు. టీడీపీ ఫిర్యాదుల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేయించారు. బీఎల్‌వోల స్థాయిలో పరిశీలన అనంతరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ద్వారా ధ్రువీకరణతో వచ్చిన వాస్తవ నివేదికలపై మరో మారు పూర్తిస్థాయి పరిశీలన చేశారు. ఈ మేరకు సమగ్ర నివేదికను ఎన్నికల కమిషన్‌కు నివేదించారు.

**వాస్తవాలు నిగ్గు తేల్చేలా..**

ఈ సారి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కుయుక్తులు పన్నుతున్న టీడీపీ తప్పుడు విధానాలు అవలంభిస్తోంది. అధికారులను తప్పుదోవ పట్టించేలా ఓటరు జాబితాలపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. ఓ పక్క దొంగ ఓట్లు నమోదును ప్రేరేపిస్తూనే, తమ వ్యతిరేకుల ఓట్లును జాబితా నుంచి తీయించాలనే తప్పుడు విధానాలను అవలంభిస్తోంది. 2024 జనవరి 5న ఫైనల్ ఓటరు జాబితాలను ప్రకటించే క్రమంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం ఇలాంటి వాటిపై నిశిత పరిశీలన చేస్తోంది. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కలెక్టర్ మల్లికార్జున ప్రత్యేక చొరవ తీసుకొని, జాబితాల తయారీలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇదే క్రమంలో రాజకీయ పార్టీల ఫిర్యాదుల్లో వాస్తవికతపై కూడా దృష్టి పెట్టి, వాటికి ఎప్పటికప్పుడు పరిష్కారం దిశగా తమ యంత్రాంగానికి దిశ, నిర్దేశం చేస్తున్నారు.

**ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా..**

| నియోజకవర్గం | చనిపోయిన వారు | డబుల్ ఎంట్రీ | ఫేక్ ఎంట్రీ | పూర్తిగా వేరే ప్రాంతానికి వెళ్లిన వారు | ఆ డోర్ నంబర్‌లో లేనివారు | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| భీమిలి | 1,518 | 821 | 11 | 94 | 5,304 | 7,748 |
| విశాఖ నార్త్ | 2,015 | 504 | 74 | 388 | 2,239 | 5,220 |
| విశాఖ వెస్ట్ | 939 | 1,091 | 230 | 375 | 3,978 | 6,613 |
| గాజువాక | 1,333 | 2,149 | 40 | 9,907 | 514 | 13,943 |
| పెందుర్తి | 3,109 | 297 | 36 | 515 | 1,391 | 5,348 |
| మొత్తం | 8,914 | 4,862 | 391 | 11,279 | 13,426 | 38,872 |

**పరిశీలన అనంతరం తేలిన అంశాలు ఇలా..**

| నియోజకవర్గం | ఫిర్యాదులో పేర్కొన్న ఓటర్లు | మృతి చెందిన ఓటర్లు | పూర్తిగా షిఫ్టు అయిన వారు | డబుల్ ఎంట్రీ ఓటర్లు | అందుబాటులో ఉన్న వారు | తొలగించినవి |
|---|---|---|---|---|---|---|
| భీమిలి | 7,748 | 1,447 | 653 | 82 | 5,566 | 0 |
| విశాఖ నార్త్ | 5,220 | 553 | 1,428 | 134 | 3,105 | 0 |
| విశాఖ వెస్ట్ | 6,613 | 259 | 3,055 | 216 | 3,063 | 20 |
| గాజువాక | 13,943 | 559 | 1,179 | 284 | 11,687 | 234 |
| పెందుర్తి | 5,348 | 2,189 | 332 | 125 | 2,702 | 0 |
| మొత్తం | 38,872 | 5,007 | 6,647 | 841 | 26,123 | 254 |

## పర్యాటక ప్రాంతాల్లో సందడి



రుషికొండ బీచ్ వద్ద జన సమూహం

**కొమ్మాది:** కార్తీకమాసం ముగిసినప్పటికీ పర్యాటక ప్రాంతాల్లో పిక్నిక్‌ల సందడి కొనసాగుతోంది. పర్యాటక ప్రాంతాలకు ఆదివారం వేలాది మంది తరలివచ్చారు. బీచ్‌రోడ్డులో పర్యాటక ప్రాంతాలు జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. సాగర్‌నగర్ బీచ్, రుషికొండబీచ్, రామానాయుడు ఫిల్మ్ం స్టూడియో, మంగమారిపేటబీచ్, రామాద్రి బీచ్, ఎర్రమట్టిదిబ్బలు, భీమిలి బీచ్, విశాఖ ఆర్కే బీచ్ ప్రాంతాలు ఉదయం నుంచి సాయంత్ర వరకు జాతరను తలపించింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.



విశాఖ పార్కుల్లో వనసమారాధనల సందడి

## అద్దంలేని బస్సుతో హైదరాబాద్‌కు..



ముందు మిర్రర్ లేని కావేరీ ట్రావెల్స్ బస్సు



నక్కపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద బస్సు నిలిపి ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

**కావేరి ట్రావెల్స్ నిర్వాకం**

**నక్కపల్లి:** చార్జీల రూపంలో వందలాది రూపాయలు వసూలు చేస్తూ సరైన కండిషన్ లేని బస్సు సమకూర్చారంటూ పలువురు ప్రయాణికులు నక్కపల్లి పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు విశాఖ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు టికెట్లు తీసుకున్నారు. ట్రావెల్స్ వారు కావేరీ ట్రావెల్స్ బస్సును ఏర్పాటు చేశారు. అయితే ఈ బస్సు కండిషన్‌లో లేదని, ముందు భాగంలో అద్దం లేదని ప్రయాణికులు తెలిపారు. చీకట్లో తాము అద్దం లేదనే విషయాన్ని గుర్తించలేదని, రన్నింగ్‌లో ముందు భాగం నుంచి విపరీతమైన చలిగాలులు రావడంతో డ్రైవర్ వద్దకు వెళ్లి పరిశీలించగా అద్దం లేని విషయం బయటపడిందన్నారు. దీంతో డ్రైవర్‌ను టికెట్స్ బుక్ చేసుకున్న ట్రావెల్ ఏజెన్సీ వారిని సంప్రదిస్తే సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. చలిగాలులతో గజగజ వణుకుతున్న వీరంతా ఎట్టకేలకు నక్కపల్లి పోలీస్ స్టేషన్ వద్ద బస్సును బలవంతంగా నిలిపివేశారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఇదే బస్సులో హైదరాబాద్ తీసుకెళ్తామని, మీరంతా రావాల్సిందేనని డ్రైవర్, బస్సు యాజమాన్యం ఒత్తిడి తెస్తోందని ప్రయాణికులు తెలిపారు. ప్రయాణం చేయకపోతే టికెట్ డబ్బులు తర్వాత వాపసు చేస్తామని, ప్రత్యామ్నాయంగా వేరే బస్సు ఏర్పాటు చేసేది లేదని చెబుతున్నారని ప్రయాణికులంతా ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 11 గంటల సమయంలో ప్రయాణికులంతా నక్కపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిటికీలకు అద్దాలు లేకపోవడం వల్ల రాత్రిపూట విపరీతమైన చలిగాలులు వీస్తున్నాయని, చలిగాలులతో గజగజ లాడుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

## కోస్టల్ సెక్యూరిటీ ఎస్పీగా రజిని



ఎస్పీ రజినికి శుభాకాంక్షలు తెలుపుతున్న అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు

కొమ్మాది: ఆంధ్రప్రదేశ్ కోస్టల్ సెక్యూరిటీ సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్‌గా రజిని ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె తూర్పు గోదావరి లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ జీవీఆర్ మధుసూదనరావు, పోర్టు, రుషికొండ కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు.

## కోడినాగు కలకలం



పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ శ్రీనివాస్

కొమ్మాది: మంగమారిపేట దరి రామాద్రి వద్ద గల ఓ గెస్ట్ హౌస్‌లో 8 అడుగుల కోడి నాగు కలకలం రేపింది. గెస్ట్ హౌస్‌లో నివాసం ఉంటున్న రాజు ఆదివారం సాయంత్రం పామును చూసి ఆందోళనకు గురయ్యాడు. వెంటనే స్నేక్ క్యాచర్ శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. అక్కడకు చేరుకున్న శ్రీనివాస్ చాకచక్యంగా పామును పట్టుకుని జన సంచారం లేని చోట విడిచిపెట్టారు. కొండ ప్రాంతం కావడంతో తరచూ పాములు నివాసాల్లోకి వస్తుంటాయని స్నేక్ క్యాచర్ శ్రీనివాస్ తెలిపారు.

## జాతీయ పోటీలకు ఉక్కు వీవీవీ విద్యార్థినులు

ఉక్కునగరం: స్థానిక విశాఖ విమల విద్యాలయం విద్యార్థినులు రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో విజయం సాధించి జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారు. శుక్రవారం ఏయూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఖేలో ఇండియా మహిళల కిక్ బాక్సింగ్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు టి. తనుజశ్రీ 14–30 కేజీల కేటగిరీలో, ఎస్. భార్గవి 14 – 50 కేజీల కేటగిరీలో, ఎస్.రోహిణి 14–42 కేజీల కేటగిరీలో బంగారు పతకాలు సాధించారు. దీంతో వారు త్వరలో హర్యానాలో జరగనున్న జాతీయ పోటీలకు హాజరు కానున్నారని ఏపీ స్టేట్ డైరెక్టర్ ఎ.అనూరాధ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లాన్సీ విజేతలను, కోచ్ శశిధర్, పీఈటీ రవిలను అభినందించారు.

# ఆరోగ్యం కోసం ఆర్గానిక్ వైపు..

- ప్రకృతి వ్యవసాయ పంటలకు పెరిగిన ప్రాధాన్యం
- మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి
- ముగిసిన విశాఖ ఆర్గానిక్ మేళా



మేళాకు భారీగా తరలివచ్చిన ప్రజలు



అలరించిన బాలికల శాస్త్రీయ నృత్యం..

ఏయూక్యాంపస్: ప్రకృతి వ్యవసాయ పంటల ప్రాధాన్యాన్ని ప్రజలు గుర్తించి.. వాటి ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం ఆనందదాయకమని రాష్ట్ర మార్కెటింగ్, కో ఆపరేషన్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న నాలుగో విశాఖ ఆర్గానిక్ మేళా ఆదివారంతో ముగియగా.. చివరి రోజు మిద్దె తోటల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించడానికి మంచి ఆహారం తీసుకోవాలన్నారు. ఆర్గానిక్ మేళాను అద్భుతంగా నిర్వహించారని నిర్వాహకులను అభినందించారు. ఎకో వైజాగ్ స్ఫూర్తిని ప్రజలు స్వీకరించి.. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీబీఐ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ జె.డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తాను కూడా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి ప్రకృతి ఆధారిత పంటల మేళాలను అన్ని జిల్లా కేంద్రాల్లో తరచూ నిర్వహించాలని కోరారు. అనంతరం మిద్దె పంటలపై మాధవి అవగాహన కల్పించారు.

ఉత్తరాంధ్రలో ఉన్నతంగా మిద్దె తోటలు పెంచుతున్న ఆరుగురిని ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేశారు. వీరిలో శ్రీకాకుళంనకు చెందిన తంగుడు సాయిరాం, విజయనగరానికి చెందిన కొండపల్లి వెంకటరావు, విశాఖకు చెందిన రాధారాణి అగర్వాల్, కిల్లి రాధ, అబిదున్నీసా, అనకాపల్లికి చెందిన పెంటకోట భాగ్యలక్ష్మి ఉన్నారు. వీరంతా తమ ఇళ్లల్లో పెంచిన మొక్కలతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన అలరించింది.

**చివరిరోజు పోటెత్తిన జనం**

ఆర్గానిక్ మేళాకు చివరి రోజు ప్రజలు పోటెత్తారు. మేళాను తిలకించడానికి, సేంద్రియ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. మేళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నర్సరీలో విభిన్నమైన మొక్కలను కొనుగోలు చేశారు. చిత్తూరులో తయారైన మట్టి పాత్రలను ఇక్కడ విక్రయించారు.



వరికంకుల కుచ్చులను చూపుతున్న దాలి నాయుడు

తునికి చెందిన విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు పోలిపర్తి దాలినాయుడు తయారు చేసిన వరి కంకుల గుత్తులు మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మాజీ ఎమ్మెల్సీ మాధవ్, భారత్ కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమార స్వామి, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రతినిధి జనార్దన్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణ, ఆర్‌వైఎస్ఎస్ ప్రతినిధి కృష్ణారావు, గో ఆధారిత ప్రకృతి రైతు సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్య వర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దువ్వాడ మీదుగా ఎర్నాకుళం స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎర్నాకుళం–ధన్‌బాద్–ఎర్నాకుళం (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఎర్నాకుళం–ధన్‌బాద్ (06077) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ రైలు ఈ నెల 18, 25 తేదీల్లో(సోమవారం) ఎర్నాకుళంలో ఉదయం 7.15 గంటలకు బయలుదేరుతుంది. మరుసటిరోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.10 గంటలకు బయలుదేరి తర్వాత రోజు ఉదయం 7.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ధన్‌బాద్–ఎర్నాకుళం (06078) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ రైలు ఈ నెల 21, 28 తేదీల్లో(గురువారం) రాత్రి 11.55 గంటలకు ధన్‌బాద్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 8.48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 8.50 గంటలకు బయలుదేరి తర్వాత రోజు తెల్లవారు 2.30 గంటలకు ఎర్నాకుళం వెళ్తుంది. ఈ స్పెషల్ అలువ, త్రిస్సూర్, పాలక్కడ్, పోదనూర్, త్రిపూర్, ఈరోడ్, సేలం, జాలర్‌పేట, కాట్పడి, అరక్కోణం, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడ, అంబోడల, కేసింగ, టిట్లాగడ్, బాలంగీర్, బార్‌గఢ్ రోడ్, సంబల్‌పూర్, జార్సుగుడ, రాజ్‌గంగ్‌పూర్, రూర్కెలా, నౌగావ్, హతియా, రాంచీ, మురి, బొకారో స్టేషన్లలో ఆగుతుంది.

# సింహగిరిపై మోగిన నెలగంట

- ఘనంగా ప్రారంభమైన ధనుర్మాస పూజలు
- రాజగోపురంలో నెలగంట మోగించిన సిబ్బంది
- గోదాదేవికి విశేషంగా పూజలు, తిరువీధి



వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ రాజగోపురంలో నెలగంట మోగిస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై ఆదివారం తెల్లవారుజామున నెలగంట మోగింది. నెల రోజులపాటు జరిగే ధనుర్మాస పూజలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఈ కార్యక్రమాన్ని అర్చకులు విశేషంగా నిర్వహించారు. ముందుగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని, ఆళ్వారులను ఆస్థాన మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. ధనుర్మాస ప్రారంభ నివేదనం, తిరుప్పావై ప్రబంధ సేవాకాలం, ధను సంక్రమణ ప్రవేశ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారిని పల్లకీలో అధిష్టింపజేసి.. ఆలయ బేడా మండపంలో ఘనంగా తిరువీధి నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో తొలి పాశుర విన్నపాన్ని పఠించారు. అనంతరం ఆలయ రాజగోపురంలో నెలగంటను శాస్త్రోక్తంగా మోగించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పిళ్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మన్మథరావుకు అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రాన్ని ఈవో అందించారు.

# మహిళలను ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు

- మేజర్ వషితా మెహరా
- వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన 26 మందికి శివా అవార్డుల ప్రదానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేజర్ వషితా మెహరా, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎమ్మెల్సీ కల్యాణి

బీచ్‌రోడ్డు: మహిళలను ప్రోత్సహిస్తే.. ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధిస్తారని మేజర్ వషితా మెహరా అన్నారు. స్త్రీ వన్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం ఓ హోటల్‌లో 'స్త్రీ వన్ ఇండియా వుమెన్ ఎచీవ్‌మెంట్ అవార్డు(శివా)' ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించడంతో పాటు వారి ప్రతిభను గుర్తిస్తే.. వారు మరింత మందికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. మహిళలు చిన్నప్పటి నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటారని, కష్టాలను అనుభవిస్తున్నారని తెలిపారు. అలాంటి వాటిని దాటుకుని.. నేడు అవార్డులు అందుకున్న మహిళలందరూ చరిత్రలో నిలిచిపోతారన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన 26 మంది మహిళలకు అతిథులు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్త్రీ వన్ ఇండియా ఫౌండర్ స్టెల్లా మైకల్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ పైడా కృష్ణప్రసాద్, ఎం.వి.నారాయణరావు, సంస్థ ప్రతినిధులు ప్రాచీరు, మారియ, రిజియా, పింకీ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. పారిశుధ్య, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలను ఈ కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

# నిజరూప దర్శనంలో కనకమహాలక్ష్మి



నిజరూప దర్శనంలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమ్మవారి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. నిజరూపంలో ఉన్న అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మండపంలో పలు వైదిక కార్యక్రమాలు జరిపారు. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీప జగన్నాథ స్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు సభ్యులు, సహాయ ఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా ఉంటా..

- వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



ఆడారి ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఇంటక్ ప్రతినిధులు

మల్కాపురం: నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు ఇటీవల జాబ్‌ఫేర్ నిర్వహించామని.. తద్వారా సుమారు 2 వేల మందికి ఉపాధి కల్పించినట్లు ఏపీ సూక్ష్మ చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. త్వరలోనే మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జీవీఎంసీ 59వ వార్డు జింక్ ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా గల గోకుల కృష్ణ కల్యాణ మండపంలో ఆదివారం హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. యూనియన్ గౌరవ అధ్యక్షుడు భోగవల్లి నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడారు. హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్, డాక్‌యార్డ్ తదితర సంస్థల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్మికులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇంటక్ జాతీయ ప్రతినిధి మంత్రి రాజశేఖర్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాద్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష మందికి పైగా ఉద్యోగాలు కల్పించారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వేల సంఖ్యలో వైద్యులు, సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. నాగభూషణం మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తానన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు యాజమాన్యంతో మాట్లాడతానని చెప్పారు. ఇంటక్ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, శ్రీరామ్‌మూర్తి, ఉరుకూటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యార్థి మృతికి స్కూల్ యాజమాన్యానిదే బాధ్యత'

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస నారాయణ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి(14) ఆత్మహత్యకు పాఠశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని అతని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం జాడుపల్లికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులు హిమబిందు, గణేష్, పెద్దమ్మ దుర్గ, సర్పంచ్ కన్నబాబు తదితరులు శనివారం రాత్రి ఇక్కడకు చేరుకున్నారు. భీమిలి పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఉదయం పెద్దమ్మ దుర్గ మాట్లాడుతూ ఆరు నెలలుగా స్కూల్ ఇన్‌చార్జి జగదీష్.. తమ బిడ్డను వేధిస్తున్నాడని ఆరోపించారు. అతను ఎలా చనిపోయాడో జగదీష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తన పేరులో మొదటి అక్షరం 'ఎస్'ను చేతిపై రాసుకుంటే.. ఒక అమ్మాయి పేరు రాసుకున్నట్లు భావించి పలుమార్లు కొట్టారని ఆరోపించారు. శనివారం మధ్యాహ్నం 2.30కు గణేష్‌కి ఫోన్ చేసినట్లు స్కూల్ యాజమాన్యం చెబుతోందని.. అయితే అతని ఫోన్ అందుబాటులో లేకపోవడంతో సాయంత్రం వరకు వివరాలు తెలియలేదన్నారు. తాము వచ్చేటప్పటికి తమ బిడ్డ మృతదేహాన్ని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి మార్చురీకి తరలించారన్నారు. ముమ్మాటికీ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం, కక్షపూరితమైన వ్యవహారం కారణంగానే తమ బిడ్డ చనిపోయాడని అతని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా.. స్కూల్‌కు చెందిన ఇద్దరు ప్రతినిధులు విద్యార్థి కుటుంబ సభ్యులతో ఉదయం నుంచి భీమిలి పోలీస్ స్టేషన్ వద్ద మంతనాలు సాగించారు. విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం చేసి తీసుకువెళ్లాలని ప్రాధేయపడుతున్నట్టు తెలిసింది. ఆదివారం సాయంత్రం వరకు ఈ విషయం ఓ కొలిక్కి రాలేదు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జీవీఎంసీ నిధులతో టీడీపీ నేత ఇంటికి కాలువ

- టీడీపీ కార్పొరేటర్‌పై స్వామి భక్తి చాటుకున్న అధికారులు



మాస్టర్ ప్లాన్ రోడ్డును ఆనుకుని టీడీపీ నాయకుడి ఇంటికి నిర్మించిన కాలువ ఇదే..

మధురవాడ: ఓ టీడీపీ కార్పొరేటర్ తండ్రి స్నేహితుడి ఇంటికి జీవీఎంసీ నిధులతో కాలువ నిర్మించడం వివాదాస్పదంగా మారింది. కార్పొరేటర్‌పై స్వామి భక్తిని చాటుకున్న అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. సుమారు రూ.1.50 లక్షల జీవీఎంసీ నిధులతో టీడీపీ నాయకుడి ఇంటికి కాలువ నిర్మించడమే కాకుండా.. ఎంతో చక్కగా ఉన్న బీటీరోడ్డును తవ్వి కల్వర్టు నిర్మాణానికి సగం పనులు పూర్తి చేశారు. జీవీఎంసీ జోన్–2 పరిధి 5వ వార్డు నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులో చెరువు గట్టు మీద ఉన్న సచివాలయం ఎదురుగా ఈ పనులు చేపట్టారు. దాదాపుగా నిర్మాణం పూర్తయిన ఆ నాయకుడి ఇంటికి సుమారు రూ.30 వేలతో 20 మీటర్ల మేర కాలువ నిర్మించారు. అంతటితో ఆగలేదు. వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు ఉండగానే.. నిత్యం రద్దీగా ఉండే బీటీ రోడ్డును శనివారం సాయంత్రం తవ్వేశారు. రూ.1.20 లక్షలతో కల్వర్టు, ఇతర పనులు ప్రారంభించారు. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశం కావడంతో.. తవ్విన రోడ్డును, సగం కాలువను ఆదివారం జీవీఎంసీ సిబ్బంది పూడ్చివేశారు. అయితే ఇదంతా చేసింది జీవీఎంసీ 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత తండ్రి స్నేహితుడి గ్రూప్ హౌస్‌కి కావడం విశేషం. పైగా అక్కడ ఉన్నది ఈ ఇల్లు మాత్రమే. దీనిపై ఏఈ సురేష్ వివరణ అడగ్గా.. ఈ విషయం తన దృష్టికి రాలేదని, పనులు నిలుపుదల చేయిస్తామన్నారు.

## యువగళానికి స్పందన అంతంతమాత్రమే..



సంతబయలులో టీడీపీ, జనసేన కార్యకర్తలు

పరవాడ/ఉక్కునగరం: తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు పరవాడలో ఆశించినంత జనం రాకపోవడంతో ఆ పార్టీ నాయకులు నిరాశ చెందారు. ప్రజల నుంచి కూడా పెద్దగా స్పందన కనిపించలేదు. పరవాడ సంతబయలులో ఆదివారం మధ్యాహ్నం 4.30 గంటలకు చేరుకున్న లోకేష్‌కు పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి లోకేష్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్థానిక పెద్ద చెరువు ఆయకట్టు రైతులు.. ఫార్మా కాలుష్యం అరికట్టాలని కోరుతూ లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. తాడి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించాలని టీడీపీ నాయకులు కోరారు. అనంతరం పరవాడ సంతబయలు, గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం మీదుగా రాత్రి 8 గంటలకు స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌కు లోకేష్ చేరుకున్నారు. గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు ఆయనకు స్వాగతం పలికారు. అంబేడ్కర్ కళాక్షేత్రంలో లోకేష్ రాత్రి బస చేశారు. పాదయాత్ర కారణంగా రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## కణుజు హడావుడి



జూ సమీపంలో బీచ్ రోడ్డు పక్కన కణుజు

ఆరిలోవ: దట్టమైన అడవుల్లో తిరగాల్సిన వన్యప్రాణులు ఆహారం కోసం జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి. ఆదివారం సీతకొండ నుంచి ఓ కణుజు బయటకు వచ్చింది. కొండ పైనుంచి కిందకు దిగి జూ సమీపంలో బీచ్ రోడ్డు వైపు హడావుడి చేసింది. రోడ్డు పక్కన పచ్చిక మేస్తుండగా విశాలాక్షినగర్ నుంచి సాగర్‌నగర్ వైపు వెళ్లే ప్రయాణికులు గుంపులుగా చేరారు. జనాలను చూసిన ఆ కణుజు చెంగుచెంగున గెంతులు వేస్తూ కనువిందు చేసింది. కొద్ది సేపటికి కణుజు మళ్లీ కొండపైకి వెళ్లిపోయింది.